క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం


శిబిరానికి హాజరైన గ్రామస్తులు

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని పచ్చునూర్‌లో మంగళవారం పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్‌ వసంత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. వెల్ది పీహెచ్‌సీ డాక్టర్‌ బియాబని పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు జుబేర్‌, ఎ.ఎజాజ్‌, సంస్థ ప్రతినిధులు, కోఆర్డినేటర్‌ రమేశ్‌, సిబ్బంది శోభ, మున్నా, అనురాధ, రాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ స్వప్న

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌ కేజీబీవీలో మంగళవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నీటి సంరక్షణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ స్వప్న మాట్లాడుతూ.. భవిష్యత్తులో నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలందరూ వర్షపు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రతి నీటిబొట్టును సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్ర దానం చేశారు. ఈకార్యక్రమంలో వలంటీర్‌ రాజశేఖర్‌, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర విజ్ఞానమే దేశాభివృద్ధికి పునాది


ప్రదర్శనలు ఇస్తున్న నరేశ్‌

రామడుగు: శాస్త్ర విజ్ఞానమే దేశాభివృద్ధికి పునాదని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు ఉప్పులేటి నరేశ్‌ తెలిపారు. మండలంలోని వెదిర గ్రామంలో మంగళవారం ఎస్‌ఆర్‌ఆర్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నేటికి మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయని, వీటిని రూపుమాపేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని సూచించారు. పలు అంశాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి సురేష్‌కుమార్‌, హెచ్‌ఎం కమల, రాజు, మహేష్‌, తిరుపతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లకు చిరుధాన్యాలపై అవగాహన అంగన్‌వాడీటీచర్లు అవగాహన కల్పించారు.

పరామర్శ


పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: మండలంలోని షానగర్‌ మాజీ సర్పంచ్‌ గునుకొండ అశోక్‌కుమార్‌ రోడ్డు ప్రమాదంలో గాయపడగా మంగళవారం రామడుగు సింగిల్‌ విండో చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు.వెదిర గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ మండలశాఖ అధ్యక్షుడు శనిగరపు అర్జున్‌ కాలుకు శస్త్రచికిత్స కాగా పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్‌, కొక్కెరకుంట సింగిల్‌ విండో చైర్మన్‌ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల శాఖ అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మాజీ గంట్ల వెంకట్‌రెడ్డి,నాయకులు ఒంటెల వెంకటరమణారెడ్డి, శనిగరపు అనిల్‌కుమార్‌, అంజన్‌కుమార్‌, చిరుత అంజయ్య, మునీందర్‌, శంకర్‌, తిరుపతి, అంజయ్య పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరాలు

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని సిర్సపల్లి గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం కొనసాగుతోంది. మంగళవారం విద్యార్థులకు వివిధ రకాల హక్కులను న్యాయవాది జైపాల్‌ రెడ్డి వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు గ్రామంలోని ఇంటింటికీ సర్వే చేస్తూ విద్య, ఉపాధి అవకాశాలపై సమగ్ర సమాచారం సేకరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఇందిరాదేవి, పూర్వ ప్రిన్సిపాల్‌ గొడిశాల పరమేశ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ లక్ష్మీనరసింహమూర్తి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్‌ డా.పి.దినకర్‌, అకడమిక్‌ కో ఆర్డినేటర్‌ డా. శ్రీనివాస్‌, గ్రామ నాయకులు విజయ్‌ కుమార్‌, వార్డ్‌ మెంబర్‌ వెంకట్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానకొండూర్‌: మండలంలోని గంగిపల్లి గ్రామంలో అక్షయ మహిళా డిగ్రీకళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు మంగళవారం శ్రమదానం చేశారు. గ్రామ వీధుల్లోని చెత్తాచెదారం, డ్రైనేజీలు శుభ్రం చేయడంతోపాటు రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చారు.


చొప్పదండి: శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్‌ రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌ శాలిని, ఎంపీటీసీ రంగు భాస్కరాచారి, ప్రిన్సిపల్‌ శైలజ, సిబ్బంది శ్రీనివాస్‌, సాగర్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామంలో కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు మంగళవారం శ్రమదానం చేశారని


మానకొండూర్‌: గంగిపల్లిలో...

ప్రోగ్రాం అధికారి, ఎన్‌ఎస్‌ఎస్‌ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్‌.ఆర్‌.గోపికృష్ణ తెలిపారు. అనంతరం ఇంపాక్ట్‌ ఫౌండేషన్‌ అధికారి డి.శ్రీనివాస్‌ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు మార్గాలను అన్వేషించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో , కళాశాల సీనియర్‌ అధ్యాపకులు డాక్టర్‌ ఎండీ.అలీఖాన్‌, కచ్చు సతీశ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన


శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో


బొమ్మనపల్లిలో పరీక్షలు చేస్తున్న ధర్మానాయక్‌

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు మంగళవారం సందర్శించారు. శిబిరానికి హాజరైన ప్రజలతో మాట్లాడారు. వైద్య సిబ్బంది కంటి పరీక్షలు సక్రమంగా చేస్తున్నారా, కళ్లద్దాలు అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సెక్రెటరీ మధుమిత, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధర్మానాయక్‌ కోరారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఇప్పటివరకు మండలంలో 10,936 మందికి పరీక్షలు చేసి 2,786 మందికి రీడింగ్‌ అద్దాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ ప్రత్యూష, హెల్త్‌ సూపర్‌వైజర్‌ హాజీబాబా, సర్పంచ్‌ భూంరెడ్డి, ఉపసర్పంచ్‌ పెంద్యాల శారదసదానందం, ఏఎన్‌ఎం స్వరూప, ఆశా వర్కర్లు కొంకట సుగుణ, కొంకట లింగవ్వ, మిట్టపెల్లి సునీత పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్‌

చొప్పదండి: పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ సూచించారు. మున్సిపల్‌ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్‌ గుర్రం నీరజ అధ్యక్షతన కౌన్సిల్‌ సాధారణ సమావేశానికి హాజరై మాట్లాడారు. పద్నాలుగు వార్డుల పరిధిలో సుమారు రూ.90 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, సెంట్రల్‌ లైటింగ్‌తో చొప్పదండి పట్టణ రూపురేఖలు మారిపోతాయని తెలిపారు. ఎమ్మెల్యే తొలిసారి కౌన్సిల్‌ సమావేశానికి రావడంతో చైర్‌పర్సన్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ శాంతికుమార్‌, కౌన్సిలర్‌లు, మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను అన్నివిధాలుగా ఆదుకుంటాం

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలను అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే రవిశం


కూలీలతో పనిచేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్‌

కర్‌ అన్నారు. మండలంలోని గుండి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి పనులు చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలి డబ్బుల కోసం ఎవరికీ లంచం ఇవ్వొద్దని, సమస్య ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఎస్పీ నాయకుల రిలే నిరాహార దీక్ష

శంకరపట్నం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్‌ జడ్జితో విచారణ చేయాలని బీఎస్పీ నాయకులు కేశవపట్నంలో మంగవారం రిలే దీక్ష చేపట్టారు. చైర్మన్‌ను తొలగించి, కమిటీని రద్దు చేయాలని నినాదాలు చేశారు. లీకేజీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీక్షకు టీడీపీ మండల అధ్యక్షుడు సయ్యద్‌ ఆరీఫ్‌ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంజయ్‌కుమార్‌, భాస్కర్‌, సంపత్‌, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: టీఎస్‌పీఎస్సీ పేపర్‌ లీకేజీ నిందితులను వదిలిపెట్టొద్దని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందెస్వామి డిమాండ్‌ చేశారు. మంగళవారం చిగురుమామిడిలో మాట్లాడారు. సీబీఐతో విచారణ జరిపిస్తే నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉందన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలను కొనడమేంటని ఏంటని ప్రశ్నించారు. సీబీఐకి పేపర్‌ లీకేజీ కేసు అప్పగించాలని ఆయన


కేశవపట్నంలో దీక్ష చేస్తున్న బీఎస్పీ నాయకులు

డిమాండ్‌చేశారు. నిరుద్యోగుల పక్షాన సీపీఐ పోరాటం చేస్తుందన్నారు.

జమ్మికుంట: లీకేజీకి కారణమైన వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేయాలని బీఎస్పీ హుజూరాబాద్‌ అసెంబ్లీ అధ్యక్షుడు బంగారి సదానందం, రాష్ట్ర కార్యదర్శి దొడ్డ సమ్మయ్య అన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్‌ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రశ్నపత్రాల లీకేజీతో కోచింగ్‌ తీసుకున్న నిరుద్యోగులు ఆర్థిక, మానసికంగా తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు.

టెక్నాలజీ వినియోగించుకుంటే అద్భుత ఫలితాలు

హుజూరాబాద్‌రూరల్‌: టెక్నాలజీ సరిగా వినియోగించుకుంటే అద్భుత ఫలితాలు ఉంటాయని నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ వరంగల్‌ కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజినీరింగ్‌ ప్రొఫెసర్‌ డా.శ్రీరాంజి సంజీవి అన్నారు. మంగళవారం మండలంలోని సింగపూర్‌ కిట్స్‌ ఇంజనీరింగ్‌ కళాశాల సమావేశ మందిరంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.శంకర్‌ అధ్యక్షతన ఆర్టిఫీషయల్‌ ఇంటెలిజెన్సీ అండ్‌ మెషిన్‌ లెర్నింగ్‌ స్టూడెంట్‌ అసోసియేషన్‌ ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ అండ్‌ మిషన్‌ లెర్నింగ్‌ ఇంజనీరింగ్‌ కోర్సు లో అత్యుత్తమ ఉపాధి, ఉన్నత విద్య అవకాశాలు ఉంటాయని తెలిపారు. మానవ మేధస్సుకు కృత్రిమ మేధస్సు తోడైతే, ఎన్నో సమస్యలను సులభంగా పరిష్కరిస్తూ, సమాజ అభివృద్ధికి పాటుపడగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమావేశ సమన్వయకర్త అధ్యాపకుడు డి.రవి, ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ అండ్‌ మిషన్‌ లెర్నింగ్‌ విభాగాధిపతి డాక్టర్‌ కె. ప్రవీణ్‌ కుమార్‌రావు, అధ్యాపకులు ఎం. సుభద్ర, ఎన్‌ రఘు, ఆర్‌.భారతి, డీ. సునీత, సహాయకులు సుధీర్‌, రామాంజనేయులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

వీణవంక: మండలంలోని కోర్కల్‌ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి నుంచి మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. లారీల్లో పోతిరెడ్డిపల్లి గ్రామానికి మట్టిని తరలిస్తున్నారని, రెండు రోజులుగా జేసీబీ సహాయంతో మట్టి తరలిస్తుండగా మంగళవారం గ్రామస్తులు అడ్డుకొని తహసీల్దార్‌ రాజయ్యకు సమాచారం అందించారు. తహసీల్దార్‌ ఆదేశాలతో మట్టి తరలింపును నిలిపివేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.

కుక్కల దాడిలో గేదె మృతి

వీణవంక: మండలంలోని ఎల్బాక గ్రామంలో చింతల శంకర్‌రెడ్డికి చెందిన గేదె కుక్కల దాడిలో మృతిచెందింది. గ్రామానికి చెందిన గేదెపై కుక్కలు దాడి చేయడంతో గేద మృతి చెందింది. సుమారు రూ.25వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఇదే గ్రామంలో ఇటీవల మనుషులపై కుక్కలు దాడి చేయగా పలువురు గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిరుధాన్యాల వాడకం పెరగాలి

చొప్పదండి: మహిళల్లో చిరుధాన్యాల వాడకం పెంపొందించాలని పోషణ్‌ పక్వాడ్‌ రాష్ట్ర అబ్జర్వర్‌ శివాల్కర్‌ అన్నారు. పట్టణంలో పోషణ్‌ పక్వాడ్‌ కార్యక్రమానికి హాజరై మహిళలతో చిరుధాన్యాల వాడకంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వాటి ప్రాధాన్యత తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి సబిత, సీడీపీవో కస్తూరి, మౌనిక, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

వీణవంక: మండలంలోని బేతిగల్‌ గ్రామానికి చెందిన గీతకార్మికుడు మడ్డి సాంబయ్య ఇటీవల తాటిచెట్టు పైనుంచి కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. తాటి కార్పొరేషన్‌ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు జిల్లా బీసీ కార్పొరేషన్‌ అధికారి రాజమనోహర్‌రావు బాధితుడికి రూ.15వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్నగౌడ సంక్షేమ అధ్యక్షుడు బుచ్చయ్య గౌడ్‌, సొసైటీ అధ్యక్షుడు మడ్డి తిరుపతిగౌడ్‌, బొంగోని పెద్దరాజయ్య గౌడ్‌, మడ్డి బాలక్రిష్ణ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు..

హుజూరాబాద్‌రూరల్‌: పట్టణంలోని 26వ వార్డుకు చెందిన మహేశ్వరం శోభారాణి కుమార్తె కు కల్యాణలక్ష్మి చెక్కు మంజూరైంది. ఈసందర్భంగా మంగళవారం ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆమె ఇంటికెళ్లి అందజేశారు. వీరి వెంట కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు, తదితరులు ఉన్నారు.

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దు



ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రూరల్‌ సీఐ జివ్వాజి సురేశ్‌ హెచ్చరించారు. కొత్తపల్లి, సిరిసేడు, మల్యాల నుంచి ఇ ల్లందకుంటకు వచ్చే రహదారుల వెంబడి రా జకీయ, వ్యక్తిగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని ప్రజలకు సూచించారు. భక్తులు వాహనాలను నిర్దేశించిన ప్రదేశాల్లోనే పార్కింగ్‌ చేయాలని పేర్కొన్నారు. ఎవరైనా భక్తులకు అసౌకర్యం కలిగేలా వ్యవహరిస్తే డయల్‌ 100 సమాచారం ఇవ్వాలని, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

అభివృద్ధి ఓర్వలేక విమర్శలు

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌, ఎమ్మెల్యే రసమయి

గన్నేరువరం: తెలంగాణ ఏర్పాటుకు ముందు తర్వాత అభివృద్ధిని ప్రజలు గుర్తించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అన్నారు. మండల కేంద్రం గన్నేరువరంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. కాళేశ్వరం, నిరంతర విద్యుత్‌, రైతుబంధు తదితర సంక్షేమ పథకాలు అభివృద్ధికి సాక్ష్యమన్నారు. వినోద్‌కుమార్‌ ఎంపీగా ఉన్న సమయంలోనే గన్నేరువరం మండలం సాధ్యమైందన్నారు. ప్రతిపక్షాలు ఓర్వలేక విమర్శిస్తున్నాయని, డబుల్‌ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్సీ కవితపై కేంద్రం వ్యవహరిస్తున్న వైఖరిని ఖండించారు. జాతీయ స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులకు రాష్ట్రం నుంచి పల్లెలు ఎంపికవుతున్నాయని, ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్‌ లీకేజీపై సిట్‌ అధికారులు ఆధారాలు ఇవ్వమంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తప్పించుకొని తిరుగుతున్నారని అన్నారు. కేంద్రం ప్రభుత్వం తెలంగాణపై కక్షపూరితగా వ్యవహరిస్తూ, కేసులతో వేధింపులకు గురిచేస్తోందని అందరూ గమనించాలని కోరారు. సమ్మేళనంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, వైస్‌ ఎంపీపీ న్యాత స్వప్న, ఆర్‌ఎస్‌ఎస్‌ జిల్లా, మండల కోఆర్డినేటర్లు గూడెల్లి తిరుపతి, బద్దం తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, మాజీ జెడ్పీటీసీ మన్మోహన్‌రావు, స్థానిక సర్పంచ్‌ పుల్లెల లక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వినోద్‌కుమార్‌, రసమయి, సారయ్యను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ఉద్యోగ సాధనపై దృష్టి పెట్టాలి

హుజూరాబాద్‌రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలతో పాటుగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సివిల్‌ సర్వీస్‌ ఉద్యోగాల సాధనపై విద్యార్థులు దృష్టి పెట్టాలని హుస్నాబాద్‌ ఎమ్మెల్యే సతీశ్‌ కుమార్‌ అన్నారు. మంగళవారం సింగాపూర్‌లోని వీఎస్‌ఆర్‌ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్‌ ప్రోగ్రాంలో మాట్లాడారు. మారుమూల గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల జీవితాలు బాగుపడాలనే ఉద్దేశంతో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ, ఉన్నత విద్య ఉచితంగా అందిస్తున్నామని, విద్యార్థులు సబ్జెక్టులపై నాలెడ్జ్‌ పెంచుకొని సివిల్‌ సర్వీస్‌ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వీవీఎన్‌ హనుమకుమార్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


డ్యాన్స్‌ చేస్తున్న విద్యార్థినులు

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌ కేజీబీవీ పదో తరగతి విద్యార్థులకు మంగళవారం హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం, టాలెంట్‌ టెస్టులు నిర్వహించడం వంటి సే వా కార్యక్రమాలు చేస్తున్న నిర్వాహకులను కేజీబీవీ స్పెషల్‌ ఆఫీసర్‌ స్వప్న అభినందించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సర్పంచ్‌ కంకణాల శ్రీలత పరీక్ష సామగ్రి అందజేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షల్లో 10 జీపీఏ సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచెం సాంబయ్య, ఉపాధ్యాయులు ధరావత్‌ పాణ్య, వేణు, నాయకులు సురేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

సివిల్‌ రైట్స్‌ డే నిర్వహించాలని వినతి

తిమ్మాపూర్‌: ప్రతినెలా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్‌, మానిటరింగ్‌ కమిటీ సభ్యుడు ఎలుక ఆంజనేయులు కలెక్టర్‌ ఆర్వీ కర్ణన్‌కు విన్నవించారు. సివిల్‌ రైట్స్‌ డేలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలని కోరారు. ఈమేరకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. తూతూ మంత్రంగా పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నారని, జీవో ప్రకారం తహసీల్దార్‌, ఎంపీడీవో, ఎస్సై, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, స్థానిక సర్పంచ్‌, దేవాదాయ శాఖ అధికారి, సంక్షేమ శాఖ అధికారులు గ్రామంలోని వివిధ సంఘాల ప్రతినిధులు, మత పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికి అనేక గ్రామాల్లో సామాజిక, కుల, మత అంతరాలు అలాగే ఉన్నాయన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలి

చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గంలో రోడ్లన్ని గుంతలమయం అయ్యాయని, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించడం లేదని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్‌ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. చొప్పదండి నుంచి వెదురుగట్టు, రాగంపేట, రామడుగు, గంగాధర మండలాలలో రోడ్ల మరమ్మతుకు వెంటనే నిధులు మంజూరు చేయించాలని సూచించారు. సమస్యలపై కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు ప్రశ్నించడం మానేశారని విమర్శించారు. సమావేశంలో నాయకులు మహ్మద్‌ సలీం, వరాల శ్రీనివాస్‌, వెన్నం రజితారెడ్డి, రొడ్డవేని తిరుపతి, మారం లింగయ్య, బుర్ర శ్రీనివాస్‌, సాయిని చంద్రయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అక్కెనపల్లి కుమార్‌

పోషకాహారంతో రక్తహీనత దూరం

హుజూరాబాద్‌రూరల్‌: పోషకాహారంతో రక్తహీనత దూరమవుతుందని అదనపు కలెక్టర్‌ గరిమాఅగర్వాల్‌ అన్నారు. మంగళవారం పట్టణంలోని కన్యాకపరమేశ్వరి ఆలయ మండపంలో పోషణ్‌ అభియాన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషక లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం సామూహిక సీమంతంలో పాల్గొన్నారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోకంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. గ్రామంలో ధోబీ ఘాట్‌ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. వెంట మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ గందె రాధిక, వైస్‌ చైర్‌ పర్సన్‌ కొలిపాక నిర్మల, ఆర్డీవో హరిసింగ్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, తహసీల్దార్‌ కోమల్‌రెడ్డి, సీడీపీవో భాగ్యలక్ష్మి, కమిషనర్‌ సమ్మయ్య తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

హుజూరాబాద్‌రూరల్‌: ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు 30 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్‌ పి.అర్పిత ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట నుంచి ఆలయం వరకు రూ.20, హుజూరాబాద్‌ నుంచి ఆలయం వరకు రూ.50, పిల్లలకు రూ.30 చార్జీ ఉంటుందని, సమాచారం కోసం 73828 48449 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలు కార్గో ద్వారా రూ.116 పొందవచ్చని వివరాలకు 95738 51108 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీతారాముల కల్యాణానికి తరలిరావాలి

హుజూరాబాద్‌రూరల్‌: పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు ప్రకటనలో తెలిపారు. కల్యాణం అనంతరం తీర్థ ప్రసాద గోష్ఠి, మహా అన్నదానం కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవం విజయవంతం చేయాలని కోరారు.

ఆంజనేయస్వామి ఆలయం నూతన కమిటీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని మంగళవారం గ్రామస్తులు ఏక్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయం ఆవరణలో కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడికిగా ఆలయ వ్యవస్థాపకుడు తనుకు ఓంకారం, అధ్యక్షుడిగా తనుకు ప్రభాకర్‌, ప్రధానకార్యదర్శిగా ఐలయ్య, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ గొడిశాల రాజకొంరయ్య, బండారి తిరుపతి, గాజుల శ్రీనివాస్‌, శ్రీకాంత్‌, కొత్తపల్లి రవి, బొజ్జ రవి, గొడిశాల సదానందం, శ్రీనివాస్‌,రాములు, భక్తులు పాల్గొన్నారు.


శంకరపట్నం: ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ